క్లుప్తంగా

11న షిర్డిసాయిబాబా ఆలయ వార్షికోత్సవం

మదనపల్లె సిటీ : స్థానిక కోటవీధిలోని షిర్డిసాయి బాబా 20వ వార్షికోత్సవం ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు సాయిసన్నిధి ట్రస్టు చైర్మన్ కె.రెడ్డప్పరావు, ప్రధాన అర్చకులు సాయిచక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు,కుంభ సంప్రోక్షణ, లోక కళ్యాణం కోసం దత్త హోమాలు జరుగుతాయన్నారు. భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం చేయవచ్చునన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

శివపార్వతుల కల్యాణోత్సవం


శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం : స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం శివ పార్వతుల కళ్యాణోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. అరుద్ర నక్షత్రంతో పాటు శంకర జయంతి వేడుకలను పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు ఖన్నాస్వామి, మురళీ శర్మాలు విగ్రహ ప్రతిమలను సుందర పుష్పాలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా దండుమారెమ్మ విగ్రహ ప్రతిష్ట


ప్రత్యేక అలంకరణలో దండుమారెమ్మ

తంబళ్లపల్లె : మండలంలోని మర్రిమాకులపల్లె పంచాయతీ తూగువారిపల్లెలో శుక్రవారం గ్రామదేవత దండుమారెమ్మ విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఏ.భువనేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రమేష్‌చార్యులు, విష్ణుచార్యులు ఆగమశాస్త్రం మేరకు సంప్రదాబద్ధంగా హోమాలు చేశారు. అమ్మవారి విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేశారు. గ్రామస్థులు నియమ, నిష్టలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు జరిగింది. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో సర్పంచు జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎంలో వెలసిన శ్రీలక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంకుర్పారణతో ప్రారంభించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఉత్సవాలు 15తేదీ వరకు జరుగుతాయని అర్చకులు రుషికేశవ్, కుమారస్వామి తెలిపారు. శనివారం ధ్వజారోహణం, తొలి గరుడ జరుగుతుందన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

ఉచితంగా బీపీ డిజిటల్ యంత్రాల పంపిణీ


బీపీ మిషన్లను అందజేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం : మండలంలో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వారు సామాజిక సేవలను విస్తృతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పీటీఎం, బి.కొత్తకోట మండలాల పరిధిలోని ఏఎన్ఎంలకు 34 డిజిటల్ బ్లడ్ ప్రజర్ మిషన్లను ఉచితంగా అందజేశారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ యస్థానీ, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్,ఎంఈఓ-టూ గౌస్‌పీర్‌ల చేతుల మీదుగా వాటిని అందజేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, అనిల్‌రెడ్డి, బాషా పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రి ఆవరణలో పారిశుద్ధ్య పనులు

కలికిరి: సీహెచ్‌సీ ఆవరణలో ఈవో అశోక్‌కుమార్, పంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ యోగేష్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆసుపత్రి ఆవరణలోని కాలువ, పరిసరాలను శుభ్రపరచారు. దుర్గంధం వెదజల్లుతున్న కాలువ శుభ్రమవ్వడంతో రోగులు హర్షం వ్యక్తపరచారు.

ఉక్కపోత.. విద్యుత్ కోతలు


గుర్రంకొండ సమీపంలోని పొలాల్లో విరిగిపడిన విద్యుత్ స్తంభాలు


యల్లంపల్లెలో విరిగిపడిన విద్యుత్‌స్తంభం

- పలుచోట్ల విరిగిపడిన విద్యుత్‌స్తంభాలు
- అంధకారంలో పలుగ్రామాలు

గుర్రంకొండ : ఓవైపు ఎండవేడిమితో ఉక్కపోత, మరోవైపు విద్యుత్‌కోతలతో జనం అల్లాడిపోతున్నారు. గత రాత్రి కురిసిన భారీవర్షాలు, గాలీ బీభత్సానికి పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా లేక పలు గ్రామాలు అంధకారంలో ఉండిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత రాత్రి కురిసిన గాలీ వాన బీభత్సానికి గుర్రంకొండతో పాటు సంగసముద్రం గ్రామాల్లో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. గుర్రంకొండ పట్టణంలోని దావూద్ సాహెబ్‌వీధి, ఇందిరమ్మకాలనీ, మార్కెట్‌యార్డు, ఇండియన్‌గ్యాస్ గోడౌన్‌ల వద్ద విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. యల్లంపల్లెలో నాలుగుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయి ఇళ్లమధ్యలో పడిపోయాయి. వీటికి తోడు పలుగ్రామాల్లో విద్యుత్ లైన్ల మీద చెట్లు, చెట్ల కొమ్మలు విరిపడ్డాయి. దీంతో గ్రామాల్లో రాత్రి నుంచి విద్యుత్ సరఫరా లేక ప్రజలు నానా కష్టాలు ఎదుర్కొంటున్నారు. కరెంటు సరఫరా లేక పోవడంతో తాగునీటి బోర్లు పనిచేయక తాగడానికి నీళ్లు లేక జనం ఇబ్బందిపడ్డారు. గుర్రంకొండ పట్టణంలో పలుచోట్ల విరిగిపడిన విద్యుత్ స్తంభాలకు ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. అయితే పలుచోట్ల విద్యుత్ తీగెలు తెగిపడిఉండడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రతి ఇరవై నిమిషాలకొకమారు విద్యుత్ సరఫరా నిలిచిపోయి కోతలు విధించారు. ప్రతిగంటలో రెండు నుంచి మూడుమార్లు కరెంటు పోవడం రావడం జరిగింది. దీంతో ఇళ్లలో పలు ఎలక్ట్రిక్ వస్తువులు కాలిపోయాయి. కాగా కరెంటు కోతలు ఒకపక్క మరోపక్క ఎండవేడవి ఉక్కపోతలతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం రాత్రి వరకు కూడా విద్యుత్ సరఫరా అంతంతమాత్రంగానే ఉండడం గమనార్హం.

ఘనంగా ఆది శంకరాచార్యుల జయంతి


ఉపనయనాలు చేస్తున్న వేదపండితులు

మదనపల్లె సిటీ : జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు స్థానిక చిప్పిలిలోని సత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం శంకర బ్రాహ్మణ సేవా సహకార సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శంకర జయంతిని పురస్కరించుకుని బ్రాహ్మణ సామూహిక ఉపనయనములు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, స్వస్తివాచనం, గణపతి హోమం, నవగ్రహ పూజ, బ్రహ్మపదేశం నిర్వహించారు. ఆది శంకరార్యులు, గాయిత్రిదేవి చిత్రపటాలకు పూజలు చేశారు. అనంతరం పదో తరగతిలో ప్రతిభకనబరిచిన విజయభారతి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని మనోజ్ఞ, ఉత్తమ టీచర్లు వరప్రసాద్, కళ్యాణలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. స్కంద హాసిని భరతనాట్యం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో శంకరబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు వి.కోదండరామయ్య, గౌరవ అధ్యక్షులు ప్రసాదరావు, ఆడిటర్ ప్రసాద్, నరసింహాచార్యులు, అమరనాథ్, నాగభూషణావు, రఘునందన్, మహిళా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సామూహిక ఉపనయనాలు


నూతన వటువులతో బ్రాహ్మణ సేవా సంఘం పెద్దలు

పీలేరు : పీలేరు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో 17వ బ్రాహ్మణ సామూహిత ఉపనయన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జగద్గురు ఆదిశంకరాచార్యులు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో గణపతిపూజ, స్వస్తి వాచనం, గణపతి హోమం, నాంది, నవగ్రహ పూజ, చవలం, బ్రహ్మోపదేశం నిర్వహించారు. నూతన వటువులచే గాయత్రీదేవి, శంకరాచార్యుల చిత్రపటాల ఊరేగింపు న్విహించారు. కల్వే జయశ్రీ, నరసింహమూర్తి 9 మంది నూతన వటువులకు నూతన వస్త్ర, తాంబూలాదులు బహూకరించారు. పీలేరు బ్రాహ్మణ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు తెనాలి శేషగిరిరావు, ఉద్యా ఫణీంద్ర శర్మ, తెనాలి రామసుబ్రమణ్యం, ప్రభాకర్‌రావు, నరసింహమూర్తి, ప్రసాద్, వెంకటేశ్వర్లు, నరసయ్య, చంద్రాస్వామి, బాలాచార్, కాశీనాథ్, మయూర్‌నాథ్, విశ్వనాథ్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి


డీఎల్‌పీఓ నాగరాజ


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నాగరాజ

నిమ్మనపల్లె : వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీఓ నాగరాజ అన్నారు. శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పంచాయతీల అభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. పన్నులు పూర్తిస్థాయిలో వసూలుచేసి స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో 100 శాతం నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి ట్యాంకర్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలన్నారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఓ రమేష్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిథున్‌చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, మారెప్ప, గౌతమి, నాగభూషణం, సరస్వతి, లోకేశ్వరి, రాజేష్, శ్రీనాథ్, నౌరిన్, మమత తదితరులు పాల్గొన్నారు.


రేపటి నుంచి ఉలవల గంగమ్మ జాతర


ఉలవల గంగమ్మ అమ్మవారు


జాతరకు సిద్ధమైన ఉలవలగంగమ్మ ఆలయం

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల పంచాయతీలో శ్రీ ఉలవల గంగమ్మ జాతర ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యదర్శి వెంకటరమణనాయుడు తెలిపారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, తీర్థప్రసాదాల వితరణ, అన్నదానం కార్యక్రమం, రాత్రి 9 గంటలకు పొద్దుటూరి వాస్తవ్యులు భక్తచింతామని నాటకం నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం భాగవతారిణి గంగావతి చే హరికథా కాలక్షేపం, రాత్రి 7 గంటలకు అన్నదాన కార్యక్రమం, అనంతరం ఆసాది కథ, భజనలు, చాందిని బండ్లు, కోలాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం భక్తులచే బోనాల సమర్పణ, మొక్కుల చెల్లింపు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు మల్లికార్జుననాయుడు, సాగర్‌రెడ్డి, హరినాథనాయుడు, మల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్‌కు చేరిన పాఠ్యపుస్తకాలు


పాఠ్యపుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈఓలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి

పీలేరు రూరల్ : మండలంలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులకు పంపిణీ చేయడానికి అవసరమై పాఠ్యపుస్తకాలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టాక్ పాయింట్‌కు చేరాయి. శుక్రవారం ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి మాట్లాడుతూ మండలంలో 72 ప్రభుత్వ పాఠశాలలు, నాలుగు గురుకుల పాఠశాలలు ఉన్నాయని, మొత్తం 6207 మంది విద్యార్థులకు పంపిణీ చేయడానికి 70 శాతం పాఠ్యపుస్తకాలు స్టాక్ పాయింట్‌కు చేరినట్లు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు మురళీధర్‌రాజు, నాగరాజ, అశోక్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ విస్తృత పర్యటన

పెద్దతిప్పసముద్రం : మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ శుక్రవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ నేపథ్యంలో మండలంలోని రంగసముద్రంలో నిర్మించిన గోకులం షెడ్‌ను పరిశీలించారు. డంపింగ్ యార్డు స్థితిగతులపై ఆరా తీశారు. అనంతరం రాపూరివాండ్లపల్లి పంచాయతీలోని రంగసముద్రం చెరువు దిగవ భాగాన 30 ఏళ్ల క్రితం అనధికారికంగా ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న గృహాలను తనిఖీ చేశారు. బాధిత గృహాల లబ్దిదారుల విన్నపం మేరకు 30 జీవో ప్రకారం ఇళ్లను రెగ్యులరైజేషన్ చేస్తూ పట్టాలను జారీ చేయాలని సబ్ కలెక్టర్ అక్కడే ఉన్న రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులు

మదనపల్లె : గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులను పినాక సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్నట్లు సొసైటీ ఫౌండర్ బి.యాదగిరి, ఐఆర్ఎస్ తెలిపారు. శుక్రవారం జ్ఞానోదయ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...డిగ్రీ మొదటి సంవత్సరం లేదా ఆపై చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, యువత వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన శిక్షణ, మెలకువలను అందిస్తున్నామన్నారు. శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 7675246888, 8328255253 ఫోన్ నెంబర్లపై సంప్రదించాలన్నారు.

రోడ్లపై వ్యర్థాలను వేస్తే చర్యలు

రామసముద్రం : పరిసర ప్రాంతాల్లో, రోడ్లపైన చెత్తా చెదారం, వ్యర్థాలను విచ్చలవిడిగా పారబోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో పీఆర్‌డీ గఫూర్ హెచ్చరించారు. శుక్రవారం చెంబకూరు గ్రామ పంచాయతీలో ఎగువ హరిజనవాడలో సిమెంటు రోడ్లపై దిబ్బలుగా చెత్తాచెదారాన్ని వేయడంతో పారిశుద్య కార్మికులచే శుభ్రం చేయించారు. అలాగే డంపింగ్ యార్డును పరిశీలించి తడి, పొడి చెత్తను వేరుచేసే విధానంపై పారిశుద్య కార్మికులకు క్లుప్తంగా వివరించారు. ప్రజలు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రెడ్డిశేఖర్, పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు.

5 నుంచి వాసవీ జయంతి ఉత్సవాలు

మదనపల్లె సిటీ : శ్రీ వాసవి కన్యాకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు ఈనెల 5 నుంచి నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలు 9వతేదీ వరకు నిర్వహిస్తామన్నారు. 7వతేదీ వాసవీ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేస్తామన్నారు. మధ్యాహ్నం ఆర్యవైశ్య యువకులచేత బైక్ ర్యాలీ, సాయంత్రం అమ్మవారిని పుష్పపల్లకీ ఊరేంగిపు నిర్వహిస్తామన్నారు. జయంతి ఉత్సవాల్లో ఆర్యవైశ్యులు పాల్గొనాలని కోరారు.

ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితుల గోడు పట్టదా?

- భూములు కోల్పోయి పునరావాసం కోసం ఎదురు చూపు
- నిధులున్నా జమ చేయడంలో జాప్యమెందుకో
- నిరసనగా పోస్టుకార్డుల ఉద్యమం


ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితుల పోస్టు కార్డుల ఉద్యమం

కురబలకోట : మూడు నియోజక వర్గాలకు వర ప్రసాదిని ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో పర్యటించారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇంత వరకు ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితుల గురించి అసలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ రిజర్వాయర్‌కు కురబలకోట, బి.కొత్తకోటకు మండలంలోని ఆరు గ్రామాల పరిధిలోని రైతుల భూములు పోయాయన్నారు. 440 మందికి నష్టపరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. ఇటీవల మొక్కుబడిగా 27 మంది రైతులకు రూ. కోటి 65 లక్షలు మాత్రమే ఖాతాలకు నష్టపరిహారం నిధులు జమ చేశారన్నారు. ఇంకా రూ. 105 కోట్లకు పైగా జమ చేయాల్సి ఉన్నా బాధిత రైతుల గోడును పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై సీఎం చంద్రబాబుకు శుక్రవారం నుం,ఇ పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టామన్నారు. ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితుల బాధలను చంద్రబాబు ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి చంద్రబాబు కళ్లు తెరిపిస్తామన్నారు.

పార్టీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి


ముస్లిం పెద్దలతో సమస్యపై చర్చిస్తున్న నిసార్‌అహ్మద్

నిమ్మనపల్లె :ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముష్టూరు అక్సా మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. స్థానిక ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు..ముష్టూరుకు చేరుకున్న ఆయన, వారితో కలిసి మసీదులో ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ...పార్టీ పటిష్టతపై చర్చించారు. సమస్యలను తమ దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఆంజాద్, ముబారక్, ఖాదర్‌బాషా, నూర్ మొహియుద్దీన్, యూనస్, అబిద్, జహీర్, నాసిర్, జలీల్‌సాబ్, ప్యారూసాబ్, గఫూర్‌సాబ్, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పులి శ్రీనివాసులురెడ్డి మృతికి నివాళి

మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వీరాభిమాని పులి శ్రీనివాసులురెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్...రెడ్డివారిపల్లె పంచాయతీ సోమానుపల్లెకు చేరుకుని, స్థానిక నాయకులతో కలిసి పులి శ్రీనివాసులురెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతి తెలిపారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ పులిశ్రీనివాసులు రెడ్డి వైఎస్సార్ సీపీకి అందించిన సేవలు మరువలేనివని, కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కొమ్మేపల్లె శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, నరేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ జయప్రకాష్ రెడ్డి, సాదిక్, చరణ్, యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట : తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి శుక్రవారం పీటీఎం, బి.కొత్తకోట మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఒక వైపు ప్రైవేటు కార్యకమాల్లో పాల్గొంటూ మరో వైపు ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను, రోడ్డు ప్రమాద క్షతగాత్రుల కుటుంబీకుల పరామర్శిస్తూ ముందుకు సాగారు. ఈ నేపథ్యంలో పీటీఎం మండలంలోని బూచిపల్లిలో మృతి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు టీవీ.రామప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం హార్సిలీహిల్స్‌లోని గంగోత్రి చెరువులో ప్రమాదవశాత్తు మృతి చెందిన బి.కొత్తకోట కాపురస్థుడు టైలర్ బాలక్రిష్ణ కుటుంబీకులను పరామర్శించి రూ.25 వేల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. అదే విధంగా బోయవీధిలో కాపురం ఉంటూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన భవన నిర్మాణ కార్మికుడు ప్రవీణ్ కుమార్‌ను పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ.10 వేల నగదును ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే వెంట రెండు మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రోత్సవంలో కలికిరి రైతులు

కలికిరి : గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవ వేడుకలలో కలికిరి రైతులు పాల్గొన్నారు. స్థానిక కేవీకే ఆధ్వర్యంలో రైతుల బృందం గుంటూరుకు చేరుకుని అక్కడ వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు, వ్యవసాయ విద్యార్థులు ప్రదర్శించిన నూతన వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయ ఉత్పత్తుల విలువల జోడింపులు, పశుపోషణలో మెలుకువలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రోన్‌ల వినియోగం తదితర స్టాల్‌ను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించినట్లు కేవీకే కో–ఆర్డినేటర్ డా. మంజుల తెలిపారు. కేవీకే ఆధ్వర్యంలో మల్టీ గ్రైన్ పౌడర్, స్వచ్ఛమైన వేరుశనగ నూనె, ఇన్‌స్టంట్ ఉలవ చారు మిక్స్, మునగ పోడి, కోకో బ్లాజం హెయిర్ ఆయిల్, హెయిర్ మాస్క్ తదితరాలను ప్రదర్శించినట్లు ఆమె పేర్కొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయండి


మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బహుజనసేన నాయకులు

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్‌లో 98 మంది ఎస్సీ,ఎస్టీ సెల్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీలను వెంటనే నియమించాలని కోరుతూ మే5న నిర్వహించనున్న చలో విజయవాడ మహాధర్నా విజయవంతం చేయాలని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బహుజన సేన కార్యాలయంలో చలో విజయవాడ మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ఏపీలో 2024లో గుట్టుచప్పుడు కాకుండా 98 మంది ఎస్సీ,ఎస్టీ డీఎస్పీలను రాష్ట్రవ్యాప్తంగా పోస్టింగ్‌లు రద్దుచేసిందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ విషయంలో జోక్యం చేసుకుని రాష్ట్రంలో డీఎస్పీలను నియమించాలన్నారు. నేషనల్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఢిల్లీ నుంచి ఏపీ ప్రభుత్వానికి లేఖ రాసినా కనీస స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్రయాదవ్, కొమ్ముహరిబాబు, శివశంకర్, లక్ష్మీనారాయణ, మిథున్, చైతన్య, రెడ్డిశేఖర్, ప్రభావతి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో కిషోర వికాసంపై శిక్షణ


అవగాహన కల్పిస్తున్న అధికారులు


అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సుజాత

మదనపల్లె : మండలంలోని సీటీఎం-1 సచివాలయం పరిధిలోని కిషోర బాలికలకు శుక్రవారం నుంచి జూన్ 10 వరకు నిర్వహించాల్సిన కిషోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంపై అంగన్వాడీలకు, సీడీపీఓ సుజాత అవగాహన కల్పించారు. కిశోర బాలికల అభివృద్ధి, సంరక్షణ గురించి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని వేసవిలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించేలా చూడాలని ఆమె కోరారు. 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వరకు గల బాలికలకు వేసవిలో వికాసం గురించి శిక్షణ ఇప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వారిలో ఆత్మవిశ్వాసం, ధైర్యం, మనోనిబ్బరం, సొంతంగా అభిప్రాయాలను పెంపొందించుటకు, వారిలో జీవనైపుణ్యాలను పెంపొందింజేయుటకు 12 విధాలుగా అవగాహన ఇస్తామన్నారు. ఈ కార్యక్రమం మే 2 నుంచి జూన్ 10 వరకు జరగుఉతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భానులక్ష్మి, చంద్రకాంత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

పెద్దతిప్పసముద్రం : ఐసీడీఎస్ అధికారులు కిశోరీ వికాసం సమ్మర్ క్యాంప్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్లు జయరాణి, భవానీలు అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు చిన్నారుల తల్లులతో సమావేశమయ్యారు. ఈ నెల 2 నుంచి జూన్ నెల 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. బాలల హక్కులు, ఫోక్సో చట్టం, ఆడ పిల్లలకు విద్య ప్రాముఖ్యత, సైబర్ నేరాలు, లింగ వివక్షత, శారీరక వ్యాయామం, ఉన్నత విద్యా నైపుణ్యాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఈఓ–టూ గౌస్‌పీర్,ఏపీఎం హరి తదితరులు పాల్గొన్నారు.

యువత వృద్ధికి మార్గదర్శి కిషోర్ వికాస్

కురబలకోట : దేశ భవిష్యత్‌గా భావించే బాలబాలికల సమగ్ర అభివృద్ధికి కిషోర్ వికాస్ యోజన కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ నాగవేణి అన్నారు. శుక్రవారం అంగళ్లు రైతు భరోసా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శారీరకంగా మానసికంగా ఎగగడానికి దిశ నిర్దేశం చేస్తుందన్నారు. ఆరోగ్యం, పోషణ, విద్య, నైపుణ్యాల అభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలన్నారు.